క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పిఠాపురంలో వేంకటేశ్వర స్వామి గరుడ వాహన సేవ

పిఠాపురం: స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానముల పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గరుడ వాహన సేవ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈనెల 15వ తేదీ వరకు ఈబ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

వేంకటేశ్వరుని ఆలయంలో సప్తాహ పూజలు

సామర్లకోట: గొంచాల గ్రామంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ఈ నెల 16 వరకు ప్రతి రోజు సప్తాహ పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పితాని రామనరసింహ మూర్తి, పద్మజ దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేస్తారన్నారు. అదేవిధంగా 13న ఆళ్ల శ్రీనివాసు, సాయిపల్లవీదేవి దంపతులు, 14న కుంచే గణేష్, స్వాతి దంపతులు, 15న పిన్నింటి శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులు, 16న చింతల వీరసంతోష్, తరుణి దంపతులు పీటలపై కూర్చుని సప్తాహ పూజలు చేస్తారని వివరించారు. కల్యాణ ఉత్సవాల్లో భాగంగా 14న స్వామివారికి చక్రస్నానం, వసంతోత్సవం, రాత్రి స్వామివారికి శ్రీపుష్పయోగోత్సవం ఉంటాయన్నారు. 17న పూర్ణాహుతి, గోపూజ, అన్నదానంతో కల్యాణ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

16న మండల పరిషత్ సమావేశం

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ అభివృద్ధి పనులపై చర్చించడంతో పాటు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

పిఠాపురం: ఎటువంటి అధికారిక లైసెన్సులు లేకుండా మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖాధికారి బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. గొల్లప్రోలు జాతీయ రహదారిపై ఎటువంటి అనుమతులు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లను ఆపి తనిఖీలు చేసిన ఆయన ముగ్గురు మైనర్లకు రూ.7500 జరిమానా విధించారు. వారి వాహనాన్ని స్వాధీనం చేసుకుని గొల్లప్రోలు పోలీసులకు అప్పగించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా పిల్లలు ప్రమాదాల బారిన పడడానికి తల్లిదండ్రులు కారరణమవుతారన్నారు. తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసకుని తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వెల్దుర్తిలో 'పొలం పిలుస్తోంది'

పిఠాపురం: స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి ఆధ్వర్యంలో పిఠాపురం మండలం వెల్దుర్తి, పి.దొంతమూరులలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఏ అచ్యుతరావు ఫార్మర్ రిజిస్ట్రేషన్, పీఎం కిసాన్ పథకం అమలు, వేసవి అపరాల సాగు, పచ్చిరొట్ట, జనుము, జీలుగ,పిల్లిపెసర విత్తనాలు సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. వ్యయసాయ యాంత్రీకరణ క్రింద పవర్ టిల్లర్లు, బ్యాటరీ, తైవాన్ స్ప్రేయర్స్, ట్రాక్టర్ పనిముట్లు, రోటావేటర్లు సబ్సిడీపై సరఫరా వివరాలు గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు రాజ్యాంగ మాణిక్యం, కీర్తి చక్రధర, బండి సత్యనారాయణ, పోకనాటి వీరబాబు, రాసంశెట్టి చల్లారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ ఒక యువతి మృతి చెందినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అమీనాబాదు గ్రామానికి చెందిన చొక్కా మణి(18) ఈ నెల 9 తేదీన చీమల మందు సేవించి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. తండ్రి చొక్కా తాతీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఒత్తిడిని జయించు.. ఫలితం సాధించు..

- ప్రణాళికతో చదివితే మెరుగైన ఫలితాలు
- పదో తరగతి విద్యార్థులకు సూచనలు
- 17 నుంచి పబ్లిక్ పరీక్షలు



కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థినులు

కొత్తపల్లి: వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయాన విద్యార్థుల్లో భయాన్న తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని కలిగించేలా ఉపాధ్యాయులు సూచనలు ఇస్తున్నారు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 7 పేపర్లతో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించడం సులభమని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు. పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వారు వివరిస్తున్నారు. ఆ దిశగా ముందుకు సాగితే మంచి మర్కులను సాధించేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఆయా సబ్జెకుల ఉపాధ్యాయులు సూచనలు చేస్తున్నారు. నిత్యం పాఠశాలలో రాసే పరీక్షల వంటివే అన్న భావనతో సిద్ధమవ్వాలని చెబుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 3065 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు

పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠాలను కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఏకాగ్రతతో చదువుతూ ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండాలంటున్నారు. ప్రణాళిక ప్రకారం చదవడం ద్వారా మంచి మార్కులు సాధించడం కష్టమే కాదంటున్నారు. బట్టీ విధానాన్ని స్వస్తి పలికి పాఠ్య పుస్తకాల్లోనే పాఠాలు చదివి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచిస్తున్నారు. ప్రతి పాఠాన్ని విశ్లేషణగా చదివితే సులువుగా అర్థం అవడంతో పాటు కలకాలం గుర్తుండిపోతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒత్తిడికి గురై సమయం వృథా చేయకుండా పరీక్షలకు సిద్ధం అవ్వాలంటున్నారు. పరీక్షల సమయంలో మంచి ఆహారపానీయాలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అవగాహనను కల్పిస్తున్నామంటున్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో

	విద్యార్థులు	పాఠశాలలు
1, కొత్తపల్లి	862	12
2, పిఠాపురం	1252	16
3, గొల్లప్రోలు	951	12

ఏం చేయాలంటే..

సమయానికి ఆహారం తీసుకోవాలి. పండ్లు ఎక్కువగా తినాలి. పరీక్ష వేళ ఒత్తిడికి గురికాకుండా తగిన నిద్రపోవాలి. అన్ని సబ్జెక్టులకు సమయాన్ని కేటాయించుకుని చదువుకోవాలి. కష్టమైన సబ్జెక్టుని ఇష్టంగా చదువుకోవాలి. బృందపఠనం అవసరమే అవుతుంది. ఏకాగ్రత కోసం ఉదయాన్నే ధ్యానం వంటి సాధనలు చేయాలి. అనుమానాలను ఉపాధ్యాయులతో చర్చించి నివృత్తి చేసుకోవాలి.

పదో తరగతి పరీక్షా షెడ్యూలు

17న మొదటి లాంగ్వేజ్, 19న రెండో లాంగ్వేజ్, 21న ఇంగ్లిష్, 24న గణితం, 26న ఫిజికల్ సైన్స్, 28న బయోలాజికల్ సైన్స్, 31న సామాజిక శాస్త్రం

నిలకడగా ఉండాలి

సమయం తక్కువ. కొండంత కోర్సు ఉందని తలుచుకుని అనవసరంగా గందరగోళానికి గురికావద్దు. నిలకడగా ఉండాలి. సబ్జెక్టు నిపుణులను సంప్రదించి ముఖ్యమైన అంశాలను ప్రణాళిక ప్రకారం చదువుకోవడం, పునశ్చరణ చేసుకోవడం ముఖ్యం. గంట పాటు చదివి దానిని కాగితంపై రాస్తూ సాధన చేయాలి. పరీక్ష సమయంలో సెల్‌ఫోన్ చూడడం చేయరాదు.

– వి.నారాయణరెడ్డి, సైకాలజిస్టు, నాగులపల్లి

ఒత్తిడికి లోనుకావొద్దు



పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకొద్దని. పక్కా ప్రణాళికతో చదివితే మంచి మార్కులు, ర్యాంకు సాధించే అవకాశం ఉంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల వారిగా విద్యార్థులకు సూచనలు ఇవ్వడం జరుగుతుంది.

– వీర్రాజు, గణిత ఉపాధ్యాయుడు కొత్తపల్లి

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పదోతరగతిలో ఈ గ్రేడులో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. 17 నుంచి పరిక్షలు ప్రారంభం కానున్నాయి. ఉన్న సమయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నాం. 100కు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా మా వంతు కృషి చేస్తున్నాం. అధిక శాతం మంది విద్యార్థులు వంద శాతం మార్కులు సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణ ఇస్తున్నారు.

– రమణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి

రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి



యూనిక్ ఐడీ ఆన్‌లైన్‌ను ఆయన పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు

కొత్తపల్లి: ప్రభుత్వం ద్వారా రైతులు ప్రయోజనం పొందాలంటే యూనిక్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందని మండల వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు అన్నారు. స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం యూనిక్ ఐడీ ఆన్‌లైన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 5,700 మంది రైతులకు గాను 5వేల మందికి యూనిక్ ఐడీ కోసం ఆన్‌లైన్ చేశారన్నారు. ఈ నెలాఖరు నాటికి నూరు శాతం పూర్తి చేస్తామన్నారు. గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలలో రైతులకు కావాల్సిన సూచనలు సలహాలను అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటుందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్ల కోసం ఆన్‌లైన్ చేసుకున్న వారికి మంజూరైన వెంటనే అందించామన్నారు.

ఇంటర్ పరీక్షకు 8 మంది గైర్హాజరు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ విద్యాసంస్థల కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం భౌతిక, ఆర్థిక శాస్త్రం పరీక్షలకు 8 విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సతీష్‌కన్నా తెలిపారు. మొత్తం 264 మందికి 256 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

- యువత పోరుకు బైక్ ర్యాలీ
- పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దొరబాబు



విలేకర్లతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు



మాట్లాడుతు తున్న వంగా గీత

సామర్లకోట: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ, స్థానిక ప్రసన్నాంజనేయ నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 8 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తామన్నారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేసి, కేక్ కట్టింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లభించక దగా పడిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అండగా ఉంటామన్నారు. విద్యాదీవెన, వసతి దీవెనలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు రూ.మూడు వేల భృతి ఇవ్వాలని, కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 9 గంటలకు మోటారు సైకిల్ ర్యాలీగా కాకినాడ కలెక్టరేట్ వద్ద నిర్వహించే యువత పోరుకు తరలివెళతామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ నాయకులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

పిఠాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో విజయవంతంగా ప్రజల పక్షాన నడుస్తున్న వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవానికి పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో బుధవారం నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత మంగళవారం స్వయంగా పర్యవేక్షించారు. ఈసందర్భంగా పిఠాపురం పార్టీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 12న నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజల చేతిలో పాసుపతాస్త్రంగా మారిన వైఎస్సార్ సీపీపై ప్రజల్లో చెక్కు చెదరని ఆత్మ విశ్వాసం ఉందని ఆమె అన్నారు. ప్రతి గ్రామంలోను ఉత్సవాలు వైభవంగా జరిగేలా చూడాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడుతోన్న ఏకై క పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. అటువంటి పార్టీ ఆవిర్భవించడం వల్లే ప్రజలకు మేలు జరిగిందన్న విషయం వారే చెబుతున్నారన్నారు. పిఠాపురం పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను అందరూ విజయవంతం చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా బుధవారం ఉదయం 8.30 గంటలకు పిఠాపురంలో పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని ఆమె పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట రైల్వే స్టేషన్‌కు నేడు జీఎం రాక



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ఇన్‌గేట్, అవుట్ గేట్ ఆర్చి పనులు



రైల్వే స్టేషన్ ఆవరణలో చేస్తున్న అభివృద్ధి పనులు

- అభివృద్ధి, సాంకేతిక పనుల పరిశీలన

సామర్లకోట: దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్‌కు మంజూరు చేసిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. జీఎం పర్యటనను పురస్కరించుకుని గత నెల రెండున దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన విషయం విదితమే. ఈ మేరకు బుకింగ్ కౌంటర్ హాల్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం ఆ ప్రదేశం శుభ్రంగా ఉండే విధంగా రంగులు వేయాలని సూచించారు. దాంతో బుకింగ్ కౌంటర్ హాల్‌లో రంగులు వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. బుకింగ్ హాల్ నుంచి ప్లాట్‌ఫారాలకు రాకపోకలు సాగించడానికి రెండు మార్గాలు ఏర్పాటు చేశారు. గతంలో ఒకే మార్గం ఉండేది.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

అదేవిధంగా ప్రయాణికులు వేచి ఉండటానికి 60 కుర్చీలను ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫారంపై సీసీ కెమెరాలకు సంబంధించిన పనులు, ఆధునిక ఎలక్ట్రికల్ లైన్ పనులు, స్టేషన్‌లోకి ఇన్‌గేట్, అవుట్ గేట్ పనులు జరుగుతున్నాయి. నూతన సిగ్నల్ వ్యవస్థతో కూడిన కార్యాలయం, విశ్రాంతి భవనం, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. జీఎం రాకను దృష్టిలో ఉంచుకుని ప్లాట్‌ఫారాలతో పాటు, అన్ని కార్యాలయాలు, పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ ఆవరణ విశాలంగా కనిపించే విధంగా సుమారు వందేళ్ల వయస్సున్న చెట్లను సైతం తొలగించారు. ఆయా పనులను రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్(వర్క్స్) రవికాంత్, ఏడీఈఎన్ బి.శివప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.గిరి పర్యవేక్షిస్తున్నారు. రైల్వే జీఎం సాంకేతిక పనుల తనిఖీకి వస్తున్నారని, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి అవకాశం ఉండదని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

యువత పోరుకుతరలిరండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగా గీత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాయిప్రసాద్, ఇతర నాయకులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తలారి దొరబాబు తదితరులు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: రాష్ట్ర వైఎస్సార్ సీపీ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పిలుపు నిచ్చారు. ఆమె మంగళవారం పిఠాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యువత పోరు కార్యక్రమంపై పార్టీ నేతలతో సమీక్షించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతు పార్టీ శ్రేణుల అంతా బుధవారం ఉదయం 8.30 గంటలకు పిఠాపురంలో పార్టీ కార్యాలయానికి చేరుకోవాలన్నారు. ఇక్కడ పార్టీ నేతలతో కలిసి పిఠాపురం నుంచి భారీ ర్యాలీగా కాకినాడ తరలివెళ్ల నున్నట్టు ఆమె తెలిపారు. కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న కాకినాడ పట్టణ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి జిల్లా నేతలతో కలిసి కలెక్టరేట్‌కు తరలివెళ్లడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆమె తెలిపారు. కూటమి నేతలు విద్యా రంగానికి, యువతకు నిరుద్యోగులకు మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని కూటమి ప్రభుత్వంపై చేపడుతున్న ఉద్యమానికి అన్ని వర్గాల నుంచి అనూహ్యమైన మద్దతు లభిస్తోందన్నారు. ఇప్పటికే యువత, నిరుద్యోగులు, మహిళలు తమ హక్కుల కోసం, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ రోడ్డెక్కి ఆందోళనల బాట పట్టారని అయినప్పటికీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నా ఆమె విమర్శించారు. ఎన్నికల సమయంలో బహిరంగంగా ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయకుండా ఇంకా అప్పుడు ఇప్పుడు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆమె విమర్శించారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలకు అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం కాకినాడలో నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి అనూహ్య స్పందన కనిపిస్తోందని ఆమె తెలిపారు. ఉద్యమంలో పాలు పంచుకునే ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపు నిచ్చారు.

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు తలారి దొరబాబు యువతకు పిలుపునిచ్చారు. మండల స్థాయిలో మంగళవారం యువత పోరు పోస్టర్లను సామర్లకోటలో ఆవిష్కరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ నాయకులు కాకినాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయం వద్దకు రావాలని కోరారు. పార్టీ నేత దవులూరి దొరబాబుతో వచ్చే మోటార్ బైక్ ర్యాలీతో కలిసి కాకినాడ వెళతామని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసి, కూటమి ప్రభుత్వం దిగి వచ్చేలా చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, ఇంటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేద్దాం

పెద్దాపురం: పార్టీ అధిష్టానం పిలుపులో భాగంగా వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం యువత పోరు వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ, కూటమి నేతలు విద్యారంగానికి, యువతకు నిరుద్యోగులకు, మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థ కుంటుపడేలా చేసిందని, దీంతో మహిళలు విద్యలో వెనుకబడే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సమస్యలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై విద్యార్థులకు అండగా చేపట్టే యువత పోరులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాపగంటి కామేశ్వరరావు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్లి వీర్రాఘవులు, గోకేడ అప్పారావు, పప్పల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పుష్పోత్సవం



అమ్మవారి తెప్పోత్సవం



ఊయల సేవ



తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారు


పిఠాపురం: తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వర శర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రీల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల తెప్పోత్సవం ఘనంగా జరిగింది. నాగేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా పుష్పోత్సవం, ఊయల సేవ కనుల పండువగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొట్లాటపై కేసు

కొత్తపల్లి: కొట్లాటలో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నాడ శివారు శీలం పాలేనికి చెందిన కందవల్లి కిరణ్‌కు అదే గ్రామానికి చెందిన శీలం సందీప్‌లు గత మూడు రోజుల క్రితం మద్యం మత్తులో గొడవ పడ్డారు. సోమవారం కిరణ్ మోటారు సైకిల్‌పై మూలపేట వెళుతుండగా సందీప్ ఆపి అతని తలపై కొట్టాడు. కిరణ్‌ను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై జి.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆపద్బాంధవికి అనారోగ్యం..!

- పది రోజులుగా అందుబాటులో లేని పిఠాపురం 108
- పట్టించుకోని అధికారులు



మరమ్మతులకు గురై కాకినాడలో మూలకు చేరిన పిఠాపురం 108 వాహనం

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అడ్డా అని చెప్పుకుంటున్న పిఠాపురంలో ఆపద్బాంధవికి అనారోగ్యం వచ్చినా పట్టించుకునే నాథులే లేరు. పిఠాపురం 108 గత పది రోజులుగా మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోపోవడంతో ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. దీంతో పిఠాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సీహెచ్‌సీకి పిఠాపురం పట్టణంతో పాటు వివిధ మండలాల్లో ప్రమాదాలకు గురైన క్షతగాత్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా అత్యవసరమైతే 108 పక్క మండలాల నుంచి రావాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో సకాలంలో 108లు రాక అనేక మంది రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 108 కూని రాగాలు తీస్తున్నాయనడానికి ఇదే నిదర్శనం.

మొండి బకాయిదారులకు నోటీసులు

- ఖాళీ స్థలాల్లో బోర్డులు
- చెల్లించకపోతే స్వాధీనం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయనున్నామని, బకాయిలున్న ఖాళీ స్థలాల్లో నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, రెవెన్యూ అధికారి శ్యామల మంగళవారం వెల్లడించారు. తన ఆదేశాల మేరకు మంగళవారం మొండి బకాయిదారుల ఖాళీ స్థలాల్లో రెవెన్యూ అధికారులు నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని కమిషనర్ తెలిపారు. ఇంటి పన్నుల బకాయిలపై రెండు శాతం అపరాధ రుసుం విధిస్తున్నట్టు చెప్పారు. మొండి బకాయిలు పెరిగిపోతే అసలు కంటే వడ్డీ ఎక్కువగా ఉండే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఖాళీ స్థలాలకు చెందిన యజమానులు ఇతర ప్రాంతాల్లో ఉంటే, వారికి బంధువులు సమాచారం ఇవ్వాలన్నారు. ఖాళీ స్థలాల బకాయిలు చెల్లించకపోతే స్థలాల అమ్మకాలు, కొనుగోలు ప్రక్రియ నిలిచిపోతుందన్నారు. అటువంటి స్థలాలను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుందని కమిషనర్ స్పష్టం చేశారు. వీరి వెంట ఆర్‌ఐ పి.సురేంద్రకుమార్, సచివాలయ కార్యదర్శి రాజీ ఉన్నారు.